


# కండ్లు తెరిశిన నెత్తురు

ఇంటికి గింత పొద్దుండంగనే జేరుకున్న. పొయ్యేతలకు కొడుకు నర్సింహుడు లేడు. కోడలున్నది, కాళ్లకు నీళ్లిచ్చింది. అత్తమ్మ గిట్ల అందరు బాగున్నరాంట అడిగింది.

పని మీద నర్సింహుడు నల్లగొండకు బొయ్యిండంట. పిల్లరిద్దరు ఆడ్కొను వొయ్యిండ్రో యేమో లేరు. “ఆనలు వడ్డయా ? ఈ కారు కన్న గింత గింజ గిరువు పండే టట్టున్నదా” అంటని అడిగింది. “ఈ సారి శెరువు అలుగెల్తాంది. కత్వ దుంకుతాంది. ఆనలకేంది బగ్గవడ్డయి” అని చెప్పిన.

కోడలు లక్ష్మి గింత చా చేసి పోశింది. అటు యిటనంగనె పొద్దు మూకింది. కల్లు బొట్టు యాళ్లయ్యింది. కని ఈడ యేడ దొర్కుతది? ఇగ అడిగి లేదని పిచ్చు కొనుడెందుకు? వాళ్లను బేజారు చేసుడు. ఇగ గమ్మున పూకోని చా తాగిన.

'శిన్న బుజ్జి లేదు. పన్నాదే?' అంటని అడిగిన. గప్పుడు శెప్పింది, "అఁ పన్నది, నాల్గు రోజులాయె కుసుకుసు మంటాంది. అంట ముట్టరాని జెరం వాంతులు. డాక్టర్ను పిలిస్తే ఇగ వొచ్చి సూదులిస్తాండు జెర నిమ్మలం అయ్యింది'' అన్చెప్పింది. బియ్యం గాలిచ్చుకుంట వొంటింట్ల కూసోని. నా పాన మూకోలె. దిగ్గున లేశి లోపల అర్రలకు బొయిన. మంచంల పండేశినుర్రి బుజ్జిని. వొల్లు ముట్టి సూస్తే బట్టి గాల్తు న్నట్లు కాల్తనే వున్నది. కని మంచి నిద్రలున్నది. 'లేపకుండ్రి మామయ్య ఇప్పటి దాక ఏడ్శి ఏడ్శి పన్నది'' అని అనంగనె ఇగమెల్లగ బయటి కొచ్చిన.

పిల్లలిద్దరు ఒచ్చిండ్రు, నన్ను సూడంగనె తాత తాతంటని మీద వడ్డరు తాతకు దండం బెట్టుడున్నదా లేదురా అని వాల్లమ్మ అనంగనె పెద్దోడు సురేశు వొంగి పెట్టిండు. చిన్నోడు సుబాశు పెట్టలె. శిగ్గు పడు కుంట మూలకు నక్కిండు 'అరె సుబాశు ఇగరార' అని పిల్శిన. రాలె సురేశూ వాన్నిట్ల పట్కరార అనంగనె వాడు పొయ్యి చెయ్యి గుంజిండు గంతె. శిన్నోడు తొపుక్కున పడ్డకు ఏడ్సుకుంట

"అరె బద్మాష్ ఇంట్ల కొచ్చిండ్రో లేదో ఏమో లొల్లి సురూ జేశిండ్రు? పోండ్రి కల్లేతులు కడుక్కోనిర్రి." అని వాల్లమ్మ అనుడే ఆల్శం, పెద్దొడు రివ్వున జింక పిల్లోలె, ఇంటెన్క కురికిండు. శిన్నోడు మెల్లగ జారిపోయే లాగు మీదికి పట్కోని ఓ శెయ్యితోని కండ్లు నల్సు కుంట వొయ్యిండు.

శిన్న బుజ్జి పెయ్యి బాగలేక పన్నది గని. లేకుంటే ఇల్లంత గున్న గున్న గజ్జెల గుర్రమోలె తిరుగు సూస్తే గింతంతున్నది. గని, దాని కడుపునిండ గునాలె. "ఏ డాక్టరు జూసిండే బుజ్జిని, మనింటి ముంద టాయనా? అని అడిగిన

"వాడు గాదు అని మీద మన్నువొయ్య! అడు డాక్టరా? యాన్నో వాన్తాన ఈన్తాన కంపోండరు పన్జేజి పని నేర్శిండు, కింద మీదవడి అరెంపీ సర్టి ఫికేటు సంపాయించిండు, గంతె. జెర మంచి బట్ట లేస్కోని సైకిలు మోటరు మీద తిర్గంగనె 'అమ్మో పెద్ద డాక్టరు కోర్సు సదివినోడేమో అంటని వూళ్లె మందను కుంటరు. ఆ మందుల పేర్లు లిస్టు రాస్కోని బట్టి వట్టిండు గొలుసు రాత నేర్శిండు. గంతె డొక్క జీలిస్తె గింత ఇంగ్లీషు ముక్క రాదు. ఎన్కటి కేం జదివిండో సాకలి సద్వు గదే యిగ దానికి తోడు ఓ మంత్రాలు నేర్శిండు—'

"అగో మంత్రాలు గూడ ఒస్తాయి. గియ్యన్ని తెల్వదు నాకు" అని నడిమిట్ల నేనే ఆపి అడిగిన

"ఆఁ... మంత్రం గాదు గింతం గాదు. అని పిండాకూడు. తూతూ మంత్రం, తుమ్మకాయ మంత్రం. అని దగ్గరికి అయినోడూ, సద్వుకున్నోడూ ఎవ్వలూ బోరు, ఇటు సుట్టు శిన్నశిన్న పల్లెల్నించి మంది ఒస్తరు. ఇంత తెల్శిన మొకాలేమో కాదాయె. ఏదో గింత ఉపు ఉపు అని వూది రెండు సర్పులు సర్వంగనె ఆల్లకింత మన్ను నిమ్మలం. మంత్రమేశిండని. సూదులు, మందులు యిస్తనే వుంటడు. దారానదో అతానదో మందిస్తాడు మూన్నాలుగులు రూపాయలు గుంజుతడు ఆ మందులల్ల ఏదో ఓటి పాగి తక్కువైతది. పల్లె జనమాయె వొర్రె రకాలు, మందుతో నేమోగాని మంత్రం తోనె తక్కువైందను కుంటరు"

అని శెయ్యి మంచిది. అదృష్టం మంచిది. అని వూళ్లె అందరను కుంటరు. గావొచ్చు అని అనిపించింది నాకు గా మాటే అన్న-

"అస్త వాచి గాదు, మన్నుగాదు. నోర్లే నోల్లను మోసం జెయ్య

నేర్పిండు. ఈడు జెయ్యనట్టి వేలకు వేలు పోస్కాని డాక్టరుకోర్సు సద్వి నోల్లకు గిరాకి లేదు...'

ఆకలయితున్నదంటని, సురేశ, సుభాశు ఒచ్చి కూసున్నరు. లక్ష్మి ఛీదరించుకున్నది. ''గీ పోరగాల్లకు నా బారేద్దు. పొద్దు మీకుతదో లేదో ఒచ్చి కూసుంటరు. జెర్ర ఆగితేం బాయె, ఉడ్కన్న మైతున్నది..' అని వాల్లమ్మ అనంగనె, జెర్రయినంక తింటని పెద్దోడు లేశి పోయ్యిండు. శిన్నోడు అప్పుడే గావాలని జిద్దు జేశిండు. వానికి పెట్టింది.

'మొన్న కేసయింది గాదు మామయ్య—' అన్నది చంటోనికి అన్నం గలిపిచ్చుకుంట.

యేందంటని అడిగిన—

'అదే యిప్పటి డాక్టరు మీద కేసు వెట్టిను, గాదు...గామొన్న గీ గుండ్ల సోమారం ఊరట. సావుకార్లు! అల్లపిల్లగానికి ఏమైందో, నిద్రల ఎట్ల గుచ్చుకపొయ్యిందో తెల్వదు గని, తొడకు సూది గుచ్చుక పొయ్యింది. ఈడికి యేసుకొచ్చిన్రు. ఇదే మన యింటిముందటి డాక్టరు దగ్గరికి—ఇగ అయెతె నాలుగైదు రోజులు తిప్పుకున్నడు. అయింత ఓ నాడు ఓ సూది జూపెట్టి, ఇగో గిదే సూది పిలగాని తొడల్నుంచి తీసినంటని సూపిండు. నిజమే గావొచ్చ ననుకున్నరు. అడిగినన్ని కొత్తలు డాక్టరుకు ముట్ట జెప్పిన్రు-పొయ్యిండ్రు. ఊరికైతె పొయ్యిండ్రు గని, నొప్పి తక్వగాలె. అవస్థఅవస్థ యిందంట. ఇగ ఆఖరికి హైద్రాబాదు తీస్కపోతె, ఆడ దవాఖాన్ల సూది తీసేశిండ్రంట! పిలగాడు బాగయిండు. గని, వాల్లు తిరిగొచ్చినంక సూడాలె, గూడెం గూడానికి కదిలొచ్చి తిట్టిన్రు. వాని బంగ్ల ముందట నిలబడి సూది తియ్యక ముందె తీసినంటివి, దొంగ సూది జూయించి, నమ్మించి, ధోక జేస్తావా! అంటని

ఇజ్జతు దీసుడే గాదు. బండబూతులు తిట్టుడే గాదు. ఆసావుకారు జెర పైన గల్లోడున్నట్టున్నది. కర్సు పెటోన్ని పిల్లగాన్ని బాగజేయించు కున్నాడు. పైసల్లేనేడే అయితే, ఎదో పేద పేదోడే అయితే వాని గతి గంతే గదా. డాక్టరు దేవుడు అని నమ్ముకునోన్ని నోట్లె మన్నే గదా-' అని చెప్తుంటే మన్సంత దేవినట్లయింది. నాకు సూపుకు మనుశులు మారిన్రు గంతె గని ఆకాలానికి ఈకాలానికి మన్సులు మార్లేదు. 'పాపపు ముండా కొడుకు నడిబజార్లేసి, కుక్కను గొట్టినట్టు - కైమ కైమ జేయ నుండె-' కసి కొద్ది అన్న.

శిన్నోడు సగం తిని సగం ఇడ్సిపెట్టి పొయ్యిండు. అన్కగడ్డ బల్సింది గాడిది. సురేశా నువ్వు తిందువు రార నాయిన-, పిల్సింది.

'అ- అంత పని అయ్యేదే వుండె. ఏదో ఎంటుక వాసిల తప్పింది గాదు. ఏం డాక్టర్లో ఏమో సందుకు నలుగు రయి పోయింద్రు-' అన్కుంట సురేశు రాంగనె అన్నం బెట్టింది.

'మీరు గూడ లేవరాదుండ్రి మామయ్య-' అనంగనే లేశి కాల్జేతులు కడుక్కున్న-ఏది అన్నంతినే యాల్లయినా గని నర్సింహుడు రాలేదు. మనుపని పక్కనే నేను గూసున్న.

ఏమున్నది యింత గొట్టె బియ్యపన్నం, గోకరకాయ కూర తెచ్చి పెట్టింది, సన్నగ ఉల్లిగడ్డలుకోశి చేసిందేమో యింత కోడిగుడ్ల కూర పెట్టింది. గోకర్ణం లింత పులుసుపెట్టి, సల్లబొట్టు లేదని మొదలేశప్పింది.

ప్చ్. ఇది యేం తిండి, ఏం కత? మంచిగ ఉన్న ఊర్లుంటె, ఎవు సము మీదొచ్చిన సాంబ బియ్యం... పెరట్ల గాశే కాయగూర, బర్రె పాలూ, పెరుగు-ఎంతైన దాని మీది కెట్లొస్తది? ఎన్ని పైసలు పోస్తె ఏంది? దుక్నం మీది దుక్నం మీద్దానోల్గెనె వుంటది. ఇంట్లగల్గినదానోలె

ఎట్లుంటది గన్క?- అనిపిచ్చింది గని, బయట కనలె. ఏం లాభం? కోడలు బాధ పడ్తది. కొడుక్కు ఉద్యోగం గిన్నే ఆయె. మరేంజేస్తరు? ఏ వూరికి తబాదిల అయితె ఆడికి పోయి బత్కాలె గదా.

ఇంతలకు మాటమీద మాటొచ్చి, ఎన్కటి ముచ్చట యాదికొచ్చె- "ఎన్కట్క గా బింగిరామక్క, మొగడు గిట్నే వుండె-యాది కున్నాదె నీకు లక్ష్మి-'' అంటని అడిగిన.

'ఏ బింగి రామక్క? ఏమో నాకు యాదికి లేదు-' అన్నది.

'అయ్యో- మనూర్లె. మిశిని గుడ్డాండు సూడు లక్ష్మినారాయణ గాని తల్లి.'

'ఆఁ- ఆఁ- జెర్రజెర్ర యాదికున్నది. ఎప్పుడో శిన్నప్పుడు నేను గింతున్నప్పుడు జూశిన ముసల్దాన్ని. సచ్చిపోయిందట గద.'

'సచ్చిపోయి శానేండ్లాయె గని- దాని మొగడు బత్కున్నప్పటి సంగతి. అంటె, ఇగో గీ లక్ష్మినారాయణ తండ్రి వెంకట్నారాయణ బత్కినప్పటి సంగతి. మంచిగ బత్కినోల్లు గాదు. దాన పెద్ద బెట్టుమీద బత్కినుర్రి గని, ఆఖర్న యటమట మయింది. వెంకట్నారాయణ అప్పట్ల వైద్యం జేసేది మంత్రాలేసేది. సుట్టు ఏడు గూడేలకు బాగ పేరెల్లి నోడాయె. అంటే నీకేమెర్క. నువ్వు పుట్టనన్న లేదు గావొచ్చు-అయితె గాయిన జోలి గిప్పుడెందుకు తీశినంటని అడగవూ-? అని నేనే అడిగి, "చెప్త"-అని చెప్పిన!

"ఇంకేంది. గీ డాక్టరోలిగెనె అప్పట్ల మందిని ముంచి, పెద్ద గయిండేమో-'' అంటని నా కోడలన్నది. గుడ్లకూర యికింత యేసుకుంట.

"ఆఁ గదె- నువ్వన్న దాంట్ల అబద్ధం లేదు. కని పొడుగ్గె నాడు? అల్ల పిల్ల ఉసురు దలిగి నాశనమై పోయిండు. ఓ అట్నాలుగు యిట్నాలుగు శరాలు తిన్నాగని వాడవనంత సంపాయిస్తే ఏడున్నది? నిలువలె- ఇప్పుడు అని కొడ్కును సూస్తివి గద బట్టలు కుట్టుకుని బత్కుతాండు. ఎన్కటికి మాకు గింత ఆలోచనెక్కడిది? నిన్నియ్యాల్లటి మన్సులు అదెట్ల? యిదెట్లని విచారించి, తెలివి మీరిండ్రు గని, మా కాలంల యేమున్నది? అంత గొర్రె దాటేనాయె. అవునంటే అవును. కాదంటే కాదు. చాదస్త్రాలు, నమ్మకాలు వుండె. గీ వెంకట్నారాయణ ఆసుంటోడు, మెల్లె మెల్లెగ జనం ల కష్మూరేమున్నది? ఆయువుపట్లు యేంటివేంటివని శిన్న శిన్నగ గుంజుకోని ఆటాడిచ్చేది."

అన్నం ఎక్కువైందని సురేశు గునుసుడు సురూజేశిండు. గాయింత ఒక్కబుక్క తినమని తల్లి అన్నంకలిపిచ్చింది. యింటెన్కకు బోయి చెయ్యి గడుక్కొనొచ్చింది.

ఇది గీయింత యినకపోతివి? అంటలి మల్లి మొదలుపెట్టిన- 'నిజానికేంది గని, అప్పట్ల అందరం అన్ని నమ్ముకున్నం. ఏదో మంత్రమేశేది. తాయిత గట్టేది, యీబూది పూశేది. చేతి కట్టె తోని పైనించి కిందిదాక వొల్లురాశి భూమ్మీద కొట్టేది. యేరోగ మొచ్చినా అట్నే చేసేది. పామో, తేలో కర్సినా అట్లనే చేసేది. అట్ల వేలమందికి చెయ్యంగ కండ్ల నిండ జూశినోడాయె ఇగ ఆ మహిమ యేదో కట్టెల్నే వున్నది. మన్శితాన యేంలేదని ఇగ మా తమ్మునికి అనిపిచ్చింది. ఉండి ఉండి యేమాయె, ఓ రోజు రెడ్డోల్ల జీత గాన్కి పాం గరిశింది. వెంకట్నారాయణను పట్క రమ్మని మనిశిని గదిమె వరకేమున్నది? శెట్టు మీది కల్లు యిడిపిచ్చుకున్నడేమో మంచిగ తాక్కుంట కూసున్నడు. అయ్యాగిట్ల పాంగరిశింది. అని బోయినోడు చెప్పంగనె- ఇప్పుడు నేనేడొస్త. మా యింటికి బోయి

పదమటి సాయబాన్ల నా చేతికట్టె కొయ్యకున్నది. కొంచవొాయి వొాల్లు దుల్పుంగ్రి-అని శెప్పిండు. ఇగవాడు అదలవాదల వెంకట్నారాయణ చేతికట్టె పట్కొచ్చి దానితోటి వొాల్లంత రాయంగనె-బత్కిండు.

అసలు పాం యిసందో గాదో తెల్వదు. యిసం పాం అయినా గూడ, ఉట్టిగ యిట్ల పట్కొని యిడిశినట్టుంది. యిస మెక్కలె ఏ మెక్కలె గంద్కే బత్కిండు. ఇంకేంది వూల్లె లొల్లి కట్టెల మయి మున్నదని. ఇగ దానికి మొక్కుడే గాదు. పూజలు జేసుడే గాదు.

ఇగ మా వోని అనుమానం గట్టిగ అయ్యింది. అన్నా! గాకట్టె తెచ్చి మనింట్ల పెట్టుకుందామె అని నన్నడిగె. యే గది మనకెందుకురా అని నేనంటి. సూద్దాం, ఆ కట్టే మయిమేందో వెంకట్నారాయణ మంత్రాలు పారతానయా లేకుంటే కట్టేలేమన్నున్నదా? అని మా తమ్ముడు పట్టు బట్టి, ఎట్ల తెచ్చిండో తెల్వదిగని, ఆని కన్ను గప్పి, ఆ నింట్ల నించి కట్టె తెచ్చి అటుకు మీద బెట్టిండు. గిట్ల జేసినంటని నా గ్గూడ జెప్పలే.

చేతి కట్టె ఎవ్వలో తీస్కపోయింద్రని వాడు తెల్సుకున్నడు. ఎత్క పోయినోడు నాశనమైతడు. ఆని వంశం కూలి పోతది. అంటని వూల్లె చెప్క తిరిగిండు, వెంకట్నారాయణ.

అట్ల వారం పది రోజులు తిర్గంగనె, గాలి వానలకు కొట్టం గూలి, మా తమ్ముని గొడ్డు సచ్చింది. అదయిన రెండొద్దులకే ఆని బిడ్డ 'బాల చేష్టలు సూపియ్య బట్టింది బత్కుతదో లేదోంటని అందరనిరి. ఇదంత చేతి కట్టే ఎత్కొచ్చినందుకే గావొచ్చు అని మావోడు బుగులు గొన్నడు. వెంకట్నారాయణేమో చేతి కట్టే తీస్కపోయినోని వంశం నాశనమయిత దని బెదురు బెట్టె ఇగ ఓ నాడు పొద్దుగాల్నే బిడ్డనెత్తుకున్నడు. అటుకు

మీద దాశిన మంత్రపు కట్టె తీసుకున్నడు. ఎంకట్నారాయణ తానికి వొయి, దండం బెట్టి, తప్పయిందని కట్టె ఒప్ప జెప్పి, బిడ్డను బత్కియ్యి మన్నడు. మావోని కమ్మూరి కనిపెట్టిండు ఎంకట్నారాయణ. యిష్ట మొచ్చినట్టు తిట్టిండు. కారెడ్డాలాడిండు. యాభై రూపాయలిస్తె, పూజ్జేసి, తాయితగట్టి బిడ్డను బత్కిస్తనన్నడు.

ఇగ మా తమ్మునికి ఆశ గదా! ఎట్టన్న బిడ్డ బత్కాలె. పైసల దేంది? పైస పెండ్లాం ముండవొయ్యి ఇయ్యాల్లవోతె, రేపు సంపా యించుకో వచ్చని అడ యీడ అప్పు సప్పు జేసి, తీస్కపోయి యిచ్చిండు, ఆనాడు శనివారం. ఒక్కపొద్దు దేవునికి కోడి గావాలంటె తీస్కపోయి యిచ్చిండు. ఇంకా యేదో కావాలంటే యిచ్చిండు. ఏమో సదివె, ఏమో సదివె పూజలేం జేసెనో యేమో, పొద్దట్ల తిర్గంగ తాయిత గట్టిండు. ఆ రోజు నిమ్మలంగనె వుండె. తెల్లారి పొద్దుగాల్లేశి సూశెతలకే మున్నది ? వొల్లంత సల్లగయింది. మంత్రాలు, తాయితలు ఏడబొయిన యోగని, బిడ్డకు ఊపిరి లేదు.''

నా ముచ్చెటంత బీరిపోయి యింటాంది లక్ష్మి.

సురేశు—లేచి పోయినట్టున్నడు

అన్నం పెట్లబోయింది, పట్టదు వొల్లనన్న.

"ఇగ అయితే మయిందీ, నేను ఊల్లెలేను. భూమి పత్తా కార్వా యిల జాగిరోని తోని నేను తిర్గుతాన. తిర్గి తిర్గి వూల్లెకు రాంగనే మున్నది? గిట్ల మీ తమ్ముని బిడ్డ సచ్చిపోయిందంటని తెల్సింది. ఇంటికి పోంగనె మా తమ్ముడు 'అన్నా!' అంటని యేడ్సిండు. యే మైందేమైందనంగనె— ఇగో, గిట్ల గిట్ల అయిందంటని చెప్పిండు.

ఎంకట్నారాయణ మీద ఏడలేని కోప మొచ్చింది—ఆ కోపంల్నే పూపుల తల్పులన్ని తన్నుకుంట వొయిన. ఎంకట్నారాయణ తింటాండు. ఈ పాపపు తిండి ఎట్లరుగుతదిరా—అని కంచం తంతె పొయి బాయి

గచ్చు మీద పడ్డది. బిత్తర పోయి సూడ వట్టిండు. మాట్లాడితే సంపుతా అని బెదిరిచ్చిన ఆని పెండ్లాం కట్టిపెట్టిన యిబూది పొట్లాలు తాయితలు అన్ని దీస్కపోయి పెంటల పోశిన—మంత్రాలేశి నమ్మించి, బతికిస్తనని చావగొట్టిండంటని శాన మంది నా రోకే మాట్లాడిన్రు.

ఆని మంత్రాల చేతికట్టె తీస్కొచ్చిన, ముక్కలు ముక్కలు యిరిపిచ్చిన........."

—చెప్తుంటె నడిమిట్లనే అన్నది లక్ష్మి. జాంబుల నీల్లు వోసు కుంట:" ఆఁ—మంత్రం కట్టె అంటే ఏంది? మన తెలివి తక్కువ తనం పిచ్చినమ్మకం......"

" అవ్ గదేమరి! ఇగ అప్పట్నించి యిప్పటి దాక, అదేదో దాని అంతు దొరికేదాక—పుట్టుట్టిగ ఏదీ నమ్మగద! అండ్కె ఇగ జీతగాని తోటి ఆ కట్టె శిన్నగ యిరిపిచ్చిన, గ్యాసునూనె పోశి ఆని యింటి ముందట్నే—ఏది? ఎంకట్నారాయణ ముందట్నే కాల వెట్టిన-

బండ కింద శెయ్యిరికి నట్టయింది గద. ఎంకట్నారాయణ కిక్కురు మన్లే—కుక్కిన పేనోలె. ఇగ బాగ అంటుకోని మంట మండు తున్నప్పుడు వూల్లె అసాము లందరొచ్చి సుట్టు నిలవడ్డరు.

లోపట వొంట్లె—నెత్తురు కండ్లు దెర్శింది!

ఆ మంటల ఎలుగుల అందరి మొకాలు ఎర్ర బడ్డాయ్—" చెప్పుడు ఆపుజేశి, అన్నం మీంచి లేశి చెయ్యి గడుక్కున్న.

"ఈ ఇంటి ముందటి డాక్టరు—మీ ఏంకట్నారాయణ సంతతే ఉన్నట్టున్నది—"అని చులకన జేసుకుంట పెళపెళ నగిండి.

ఒక్క లక్ష్మిదే గాదు;

ఆ నవ్వుల 'లోకం' గొంతు యినిపిచ్చింది.

నేను గూడ గొంతు గల్పిన—

యువజన—1976